యూనియన్ బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ లావణ్యకుమారి

కాచిగూడ: బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి ఎ.శ్యామలదేవి మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు యూనియన్ బడ్జెట్, దేశ ఆర్థిక విధానాలపై అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బడ్జెట్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ పోటీలను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ లావణ్య కుమారి తెలిపారు. పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వసుంధర దేవి, కామర్స్ విభాగాధిపతి దీపనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మాజీ కార్పొరేటర్ ముఠా పద్మను పరామర్శిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ కార్పొరేటర్ ముఠా పద్మనరేష్‌ను బుధవారం గాంధీనగర్ కార్పొరేటర్ పావని నేరుగా వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ముఠా పద్మను ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్ కుమార్, నవీన్‌కుమార్ ముదిరాజ్, రత్నసాయిచంద్, జి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



ఎన్ఎస్ఎస్ వలంటీర్లను సన్మానిస్తున్న జస్టిస్ వామన్‌రావు

కాచిగూడ: మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వామన్‌రావు అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందిరా ప్రియదర్శిని కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులను ఆయన సత్కరించారు. ఆడపిల్లలు ఇంటికి మహాలక్ష్మి అని అన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, ఫరూక్ అలీఖాన్, ఇట్టా ఉదయశ్రీ, యాస్మిన్ కౌసర్, డాక్టర్ ధనంజయ్, డాక్టర్ రవితేజ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎ.సృజనగౌడ్, రేను వైష్ణవి, తహసీన్ సబా తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్‌గా అవంతి కాలేజీ జట్టు

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల కాన్ కి డో పోటీలలో బర్కత్‌పుర అవంతి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ జట్టు చాంపియన్‌షిప్‌ను కైవశం చేసుకున్నట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 11, 12 తేదీలలో నాగోల్‌లోని జేబీఎల్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన పోటీలలో ఓయూ పరిధిలోని వివిధ కాలేజీల జట్లు పాల్గొన్నాయి. అందులో అవంతి జట్టు విజేతగా నిలిచినట్లు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.సునీల్‌కుమార్, ఐయూటీ డైరెక్టర్ ప్రొ.దీప్లా, పీడీ డాక్టర్ సోమేశ్వర్‌రావు, జేబీఎల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాబులాల్ తదితరులు విజేతలకు చాంపియన్‌షిప్ ట్రోఫీని, మెడల్స్‌ను అందించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మార్కెట్ పోలీసులు స్వాధీనం చేసికున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. బుధవారం మోండా మార్కెట్ డైమండ్ హౌస్ ప్రాంతంలోని ఓ షాపు ముందు గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి వున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని చనిపోయినట్లు తెలిపారు. మృతుడికి 40 నుంచి 45 ఏళ్ల వయసుంటుందని తెలిపారు.

హెల్ప్ తీసుకోండి

- సర్కిల్ కార్యాలయాల్లో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లు
- దరఖాస్తు దారులకు ఫోన్లు
- వారం రోజుల్లో ధ్రువీకరణల జారీకి ఏర్పాట్లు
- కార్యాలయాల్లో ఎల్ఆర్ఎస్ సందడి



జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్



సికింద్రాబాద్: అనేక రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ఎట్టకేలకు మోక్షం లభిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసుకున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు తాజాగా జీహెచ్ఎంసీ అధికారులు పరిష్కారం చూపుతున్నారు. జీహెచ్ఎంసీ ఉత్తరమండలం కార్యాలయం నుంచి వారం రోజుల క్రితం సర్కిల్ కార్యాలయాలకు సిటీ ప్లానింగ్ విభాగం అధికారులు బదిలీ చేశారు.

– దరఖాస్తు దారుల సందేహాలు నివృత్తి చేయడం, సమస్యలు పరిష్కరించడంతోపాటు వారి నుంచి ఫీజు రాబట్టేందుకు జోనల్ పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఫీజు చెల్లించిన దరఖాస్తు దారులకు వారం రోజుల్లోగా ఎల్ఆర్ఎస్ సర్టిఫికెట్లు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసకుంటున్నారు.

ఈనెల 31 వరకు రాయితీ....

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు పలు పరిశీలనల అనంతరం ఆమోదం లభించిన దరఖాస్తు దారులు ఈనెల 31 లోపు ఫీజు చెల్లించుకునేందుకు మున్సిపల్ అధికారులు అవకాశం ఇచ్చారు. నిర్ణీత తేదీ లోపు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ఇస్తున్నారు. ఈ సమాచారాన్ని ఆమోదం పొందిన దరఖాస్తు దారులకు నేరుగా ఫోన్ చేస్తూ సమాచారం అందిస్తున్నారు.

◆ ప్రభుత్వ యాప్‌ల ద్వారా ఫీజు చెల్లించే పద్ధతులను వివరిస్తున్నారు. సమస్యలు, సందేహాలు ఉంటే నేరుగా జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ వద్దకు రావాలని ఆహ్వానిస్తున్నారు. రాయితీ ప్రకటించిన నేపథ్యంలో పలువురు దరఖాస్తు దారులు ఫీజు చెల్లింపుకు ముందుకు వస్తున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం

తమకు అందిన దరఖాస్తులు అమోదించడంలో జోనల్ సిటీప్లానింగ్ విభాగం అధికారులు పలు కసరత్తులు చేసిన మీదట ఆమోదం తెలుపుతున్నారు. నాలాలు, చెరువులు, ప్రభుత్వ, వివాదాస్ప భూముల గురించి సమగ్రంగా పరిశీలన జరిపిన మీదట ఆమోదం తెలుపుతున్నారు.

◆ ఇందుకోసం రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల అధికారం తీసుకుంటున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది నెలలకు పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ దరఖాస్తులు క్లియర్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శక సూత్రాలు జారీ చేసినప్పటికీ వివిధ ప్రభుత్వ విభాగాల అధికారుల మధ్య సయోధ్య కుదరకపోవడం, కొందరు దరఖాస్తు దారులు ఆసక్తి చూపకపోవడం ఫలితంగా జాప్యం జరిగింది.

4వేల మందికి సమాచారం

జీహెచ్ఎంసీ ఉత్తర మండలం పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల పరిధిలో మొత్తంగా 4,795 మంది దరఖాస్తులను ఎల్ఆర్ఎస్ కోసం ఆమోదించారు. వీరందరికీ ఎల్ఆర్ఎస్ ఫీజు ఆన్‌లైన్‌ద్వారా చెల్లించాలంటూ ఫోన్ కాల్ ద్వారా, మెస్సేజ్ ద్వారా సమాచారం అందిస్తున్నారు.

◆ జోనల్ పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల్లో ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో అత్యల్ప దరఖాస్తులు 165, మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అత్యధికం 3,395 దరఖాస్తులను ఆమోదించిన అధికారులు ఫీజు చెల్లించాలని కోరుతున్నారు. సరైన ధృవీకరణలు దరఖాస్తుతో జత పరుచకపోవడం, భూసమస్యలు, వివాదాల కారణంతో మరో 149 వరకు దరఖాస్తులను జీహెచ్ఎంసీ అధికారులు పెండింగ్‌లో ఉంచారు.

సర్కిల్ పేరు	ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు
సికింద్రాబాద్	531
అంబర్‌పేట్	339
ముషీరాబాద్	165
బేగంపేట్	365
మల్కాజిగిరి	3395
మొత్తం	4795

వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

ముషీరాబాద్: మధుమేహం, రక్తపోటు, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యం పొందాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి అన్నారు. బుధవారం బాకారంలో సాంక్రామికేతర జబ్బులు (ఎన్‌సీడీ–నాన్ కమ్యూనికబుల్ డిజీజెస్) నియంత్రణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వైద్య శిబిరాన్ని డాక్టర్ మనోజ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, స్ట్రోక్, కేన్సర్ వంటివి రోజు రోజుకు పెరిగిపోతున్నాయని అన్నారు. ఈ వ్యాధులకు ప్రధాన కారణం మద్యం, పొగాకు, అనారోగ్యకరమైన ఆహారం, తగిన శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, ఊబకాయం, రక్తంలో చెక్కర, కొలస్ట్రాల్ పెరగడం వల్ల వస్తాయని తెలిపారు. మధుమేహం, రక్తపోటు లాంటి జబ్బులు 30 – 40 ఏళ్ల వారిలో సర్వసాధారణం అయిపోయాయని పేర్కొన్నారు. ప్రజలు ఆహార నియమాలు పాటిస్తూనే ప్రతి రోజు వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఏఎన్ఎం పద్మ, లత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డా. మనోజ్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనలో మహిళలకు సంపూర్ణ న్యాయం



సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో మాట్లాడుతున్న సునీతామహేందర్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మహిళలపై దాడులను అరికట్టినప్పుడే మహిళా దినోత్సవానికి సార్థకత ఉంటుందని వికారాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... మహిళలకు ఇంటా బయట ఎక్కడ చూసినా ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వం మహిళా సంక్షేమంలో విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో మహిళలకు సంపూర్ణ న్యాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెన్షనర్ సమస్యలను పరిష్కరించడానికి తన వంతుగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఉమెన్ పెన్షనర్స్ అసోసియేషన్ ఫోరం చైర్మన్ ఆర్ ఉమాదేవి, పెన్షనర్స్ అసోసియేషన్ ఉమెన్ వింగ్ చైర్మన్ జి.సూర్యకళ, కోఆర్డినేటర్ ఝాన్సీరాణి, కో–చైర్మన్ స్వర్ణకుమారి, కన్వీనర్ జానకీబాయి, శ్రీదేవి, రుద్రమ, అసోసియేషన్ అధ్యక్షుడు కనకం కొమురెల్లి, కోశాధికారి ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌ను ముందే గుర్తిస్తే నిర్మూలించవచ్చు



ముషీరాబాద్‌లో బ్రెస్ట్ కేన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: కేన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం పొందితే పూర్తిగా నిర్మూలించవచ్చని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలోని బ్లూబర్డ్స్ హై స్కూల్‌లో ఎంజేఆర్ కేన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బ్రెస్ట్ సర్వైకల్ స్క్రీనింగ్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ... మహిళలు కుటుంబ బాధ్యతతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. బ్రెస్ట్ కేన్సర్‌ను నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు కేన్సర్ వ్యాధిపట్ల ఆందోళన చెందకుండా సంబంధిత డాక్టర్లను సంప్రదించి వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మనోజ్‌కుమార్, డాక్టర్ యోక్షిత, ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పూసగోరక్‌నాథ్, దీన్‌దయాల్‌రెడ్డి, సత్యనారాయణబాబు, రాజేందర్, శ్రీకాంత్‌యాదవ్, టీఆర్ గోవింద్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కకుమార్, ఎంజేఆర్ కేన్సర్ స్క్రీనింగ్ రీజినల్ సెంటర్ అధ్యక్ష, కార్యదర్శులు ముస్మిత్ జాగీ, సవితాప్రేమ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లును ఆమోదిస్తే కాంగ్రెస్ పతనం తప్పదు



మాల మహానాడు కార్యాలయంలో మాట్లాడుతున్న ప్రొ. బీఎల్ రాజు, కృష్ణస్వరూప్

కాచిగూడ: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని తెలంగాణలో బొంద పెడతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొ. డాక్టర్ బీఎల్ రాజు హెచ్చరించారు. బుధవారం నారాయణగూడలోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఈ అంశంపై రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం ఉల్లంఘిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడితే తమ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని మాల ప్రజాప్రతినిధులు చట్ట సభల్లో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

– ఇప్పటికే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా స్టే రావాలని రాష్ట్ర హైకోర్టులో పలు రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దళితుల భవిష్యత్‌ను దెబ్బతీసే విధంగా పాలక ప్రభుత్వాలు ఎస్సీల రిజర్వేషన్లను సొంత రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని సుప్రీం కోర్టు గతంలోనే హితవు పలికిందన్నారు. వర్గీకరణ చేపట్టే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మాహానాడు నేతలు జేఎస్ రావు, వల్లం సురేష్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్, ఆర్ల రమేష్, అక్కిదాసు మహేశ్వరరావు, చిప్పరి సుబ్బారావు, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై మట్టికుప్పలను తొలగించండి




చెప్పల్‌బజార్‌లో మట్టికుప్పలను చూపిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులు పూర్తయినా మట్టికుప్పలను మాత్రం తొలగించడం లేదని కార్పొరేటర్ ఉమారాణి అన్నారు. బుధవారం చెప్పల్‌బజార్‌లో ఆమె పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ రోడ్డుపై పేరుకుపోయిన మట్టికుప్పలను తొలగించాలని అన్నారు. ఆ తర్వాత ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. జలమండలి అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌యాదవ్, బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, రూపేష్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రూప్‌కిరణ్, సూరి, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ స్క్రాప్ గోదాంలో భారీ పేలుడు

కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన ఇసాక్ అహ్మద్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ గుల్షన్‌నగర్‌లోని కట్టేకాంటా సమీపంలో ఓ ప్లాస్టిక్ స్క్రాప్ గోదాంలో బుధవారం భారీ పేలుడు సంభవించడంతో కార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. కట్టేకాంటా సమీపంలో కరీం అనే వ్యక్తి ప్లాస్టిక్ స్క్రాప్ గోదాం నిర్వహిస్తున్నాడు. అతని వద్ద బిహార్‌కు చెందిన ఇసాక్ అహ్మద్(28) ప్లాస్టిక్ వస్తువులను పగలగొట్టి భద్రపరిచే పని చేస్తుంటాడు. ఇందులో భాగంగా గుర్తు తెలియని కెమికల్ డబ్బాను పగలగొడుతుండగా భారీ శబ్దంతో పేలడంతో పనిచేస్తున్న కార్మికుడు ఇసాక్ అహ్మద్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ముఖం, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఇసాక్ అహ్మద్‌ను ఆటోలో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ముషీరాబాద్ సీఐ రాంబాబు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే భారీ శబ్దం వల్ల స్థానికులు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు.

లోపభూయిష్టంగా కేంద్ర బడ్జెట్



ఎస్వీకేంద్రంలో పట్టణం సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో మాట్లాడుతున్న కె. వేణుగోపాల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లోపభూయిష్టంగా ఉందని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ అన్నారు. అది కేవలం పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉందన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పట్టణం సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 'కేంద్ర బడ్జెట్–2025 ప్రజా ప్రత్యామ్నాయం'అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ... పేదలు, రైతులు, యువత మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నప్పటికీ కేటాయింపులు మాత్రం అలా లేవన్నారు. కీలకమైన విద్యా, వైద్య రంగాలకు.. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి భారీ కోతలు పెట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కె. శివకుమార్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఈవీఎస్ఎస్ రవీంద్రనాథ్, పట్టణం సంస్థ రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దేశ జనగణనలో కులగణన చేపట్టాలి



కాచిగూడలో మాట్లాడుతున్న ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ నేషనల్ కన్వీనర్ కోల జనార్దన్

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా త్వరలో చేపట్టబోయే జనాభా లెక్కల్లో కులాలవారీగా ఓబీసీల లెక్కలు సేకరించాలని ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ నేషనల్ కన్వీనర్ కోల జనార్దన్ డిమాండ్ చేశారు. ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో 'సామాజిక న్యాయం – రాజ్యాధికారంలో ఓబీసీల పాత్ర'అనే అంశంపై అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, కుల సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జనాభాలో బీసీల దామాషా ప్రకారం కులాలవారీగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. జనాభా ప్రకారం బడ్జెట్ కేటాయించలేదని ఆరోపించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు పగడాల సుధాకర్, తంగెళ్లముడి నందగోపాల్, ఉదయ్‌కుమార్ నేత, మట్ట జయంతి, నీలం వెంకటేష్, రాజు నేత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని భూకబ్జాదారుల నుంచి కాపాడాలని ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ మహేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... సుమారు 700 గజాల ప్రభుత్వ స్థలం కబ్జాకాకుండా అధికారులు ప్రహరీ నిర్మించారన్నారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ హయాంలో ఈ స్థలంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌కు సైతం అందజేశారని తెలిపారు. కానీ కొందరు వ్యక్తులు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించడంతో పాటు ప్రహరీని సైతం కూల్చివేశారని పేర్కొన్నారు. బుల్డోజర్‌తో స్థలాన్ని సైతం చదును చేస్తున్నారని అన్నారు. వెంటనే స్థానికులతో కలిసి ఎంఆర్‌వో, ఆర్‌డీవోకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. త్వరలో హైడ్రా కమిషనర్, జిల్లా కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నిత్యానంద్, నాగేందర్, అనిల్, భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్, సీనియర్ నాయకులు దావత్ మచ్చేందర్, భాగ్యమ్మ, జనక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



కూల్చిన ప్రభుత్వ స్థల ప్రహరీని చూపిస్తున్న మహేష్‌కుమార్, బీజేపీ నాయకులు

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మున్నూరుకాపు భవన్‌లో జరిగిన వేడుకల్లో ఆత్మకూరి ప్రీతి, మణికొండ వెంకటేశ్వర్‌రావు

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు ఆత్మకూరి ప్రీతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని మున్నూరు కాపు భవన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ... ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవుల్లో మహిళలకు 50శాతం అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు అంత్యాక్షరి, నృత్య పోటీలు, తదితర సాంస్కృతిక, క్రీడలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో రాణించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్స్‌ను ఆయన ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పొన్న సునిత, కొత్త కల్పన, సాధినేని గీత, వినోద్ కుమార్, కొంతం సురేష్ బాబు, గడేకర్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలపై ముఖ్యమంత్రి స్పందించాలి



ఎస్వీకేంద్రంలో జరిగిన కళాకారుల సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కళాకారుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలంగాణ జానపద వృత్తి పరిరక్షణ జేఏసీ నాయకులు, టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, మురళీదేశ్‌పాండే డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 11 ఏళ్లుగా తెలంగాణ జానపద సినిమా కళాకారులు ఏ ఒక్క సంక్షేమానికి నోచుకోలేదని అన్నారు. తక్షణమే జానపద సినిమా కళాకారుల సంఘాలతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ జానపద అకాడమీని ఏర్పాటు చేయాలని అనేక మార్లు మంత్రులకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ కూడా కళాకారుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. దగాపడ్డా కళాకారులంతా రోడ్డు ఎక్కక ముందే వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండూరి భాస్కర్, వెంకట్రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, టి.రమేష్, డప్పు స్వామి తదితరులు పాల్గొన్నారు.